# కథకుడు

తన విషయంలో గర్వపడాల్సింది యేమైనా వుంటే—అది శ్రీపతి కథకుడుగా సంపాయించుకొన్న పేరు మాత్రమే! గత ఆరు సంవత్సరాలకృషీ ప్రజల పొగడ్తలరూపంలో దేశమంతటా వెదజల్లబడ్డది. తన కథ ప్రచురితమైననాడు తనను కొద్దో గొప్పో ఎరిగినవాళ్లందరూ ఎదురై "మీ కథ చాలా బావుంది—" అని చిరునవ్వుతో కూడిన అభిప్రాయాన్ని జారీచేస్తారు. ఒకళ్లిద్దరు మరికొంత అదనపు ఓపికతో తన కళాభిరుచిని అదేపనిగా స్తుతిస్తూ రెండు మూడు రోజులు వెంటపడ్డారు. కాని, కనీసం కాఫీడబ్బులయినా గిట్టుపాటు కాకపోవటంవల్ల త్వరగానే మేలొంతని నిష్క్రమించారు.

సంపాదకులు సయితం తన కథలు బాగున్నాయంటారు; మరికొన్నింటికి ఎదురుచూస్తున్నా మంటారు. ఎంతవాడినా ఖర్చువని పదజాలంతో తనను మెచ్చుకుంటారు. దేశంలోని వివిధప్రాంతాలలోని పాఠకులు పోస్టుద్వారా తనను మెచ్చుకోవటమే–తన పేరుకు ప్రబల నిదర్శనం.

బీదరికసమస్య వొకటే తనకళాభివృద్ధికి పెట్టని ఆనకట్ట! ఉన్నత భావాల్తో రచనను సాగిస్తూన్న సమయంలో గృహిణి ఇంట్లోకి కావల్సిన సరుకుల జాబితాను–వంటింట్లోంచి ఏకరువు పెడుతుంది; ఇంక కలం ముందుకు సాగదు. మనస్సు పాడౌతుంది. గాయపడ్డ హృదయంతో పిచ్చివాడులాగు ఊరంతా తిరిగి ఏ అర్ధరాత్రి సమయానికో కొంపజేరుతాడు. సగంరాసి వదిలేసిన ఆ కథవిషయం తిరిగి ఆలోచించేశక్తి

మాయమవుతుంది. మరో సమయంలో కొడుకు శిథిలావస్థలోవున్న తన బట్టలమూటతో తయారై, వాటిని సాక్షులుగా చూపుతూ, ఫిర్యాదు చేస్తాడు. నిర్మల తటాకంలో రాయి పడ్డట్టు—జాగ్రత్తగా పదిల పరుచుకొన్న ఉన్నతాశయాలన్నీ పటాపంచలౌతై. ఇంట్లో కూర్చొని రచనను సాగించేశక్తి తనలో లేదు. ఏ అర్ధరాత్రన్నా ఇల్లంతా మాటుమణిగాక, రచనను సాగిద్దామనుకొని, లాంతరు వెలిగించబోతాడు. అందులో నూనె వుండదు; నిస్పృహతో కలం ముడుస్తాడు. పోస్టేజీకి డబ్బులేక—తన రచనలు అచ్చుకు పోకుండా పదేసి రోజులుకూడా ఆగవలసి వచ్చేది. తలవెంట్రుకలన్ని కష్టాలనడుమ నలిగుతూ రచనను సృష్టించాలి...తన రచనల్ని చదివి ఆనందించేవాళ్లు దేశంలో చాలామంది ఉన్నా-వారెవరికీ తన కృషితో మాత్రం సంబంధం లేదు. తనను కథల్లో చూసిన పాఠకులకు—తన వాస్తవిక జీవితంలో ఏభాగమైనా తెల్సునా అనేది అనుమానించవలసిన విషయం. తన ఆశయాల్ని మెచ్చుకొనేవారికి, తన జీవిత సమస్యలతో పనేమిటి?

ఆ రాత్రి లాంతర్లో నూనె వుండటమే తనకు ప్రోత్సాహమై—ఏకాగ్ర దృష్టితో నిద్రాముద్రిత ప్రపంచంలోంచి, తెంచుకుపోయి నూతనవాతావరణంలో కథరాస్తున్నాడు. మధ్యలో గృహిణి "ఏమిటండీ అది?" అన్నమాటలకు అతను ఉలిక్కిపడ్డాడు. ఏదో నేరంచేసినవాడిలాగు కొన్ని నిమిషాలవరకూ నోట మాటరాలేదు.

"కథ!" అని వెటకారంగా నవ్వి ఆమె అంది: "కూటికీ గుడ్డకూ కొరగాని యీ కథలెందుకు? గుడ్డికన్ను మూసినా, తెరిచినా వొకటే—మీ రచనలుకూడా కుటుంబానికి అంతే ఉపయోగకరంగా వున్నై. కడుపులో చల్ల కదలనివాళ్లకు కాని—యీ సాహిత్యం మీ కెందుకూ?"

ఆమె కాపరానికి వచ్చిందిమొదలూ, రోజు కొకసారైనా ఈమాటల్ని అంటూనేవుంటుంది. మొదట్లో అమెకు తన ఆశయాన్ని విప్పిచెప్పేందుకు ప్రయత్నించేవాడు; కాని, తన మాటలు ఆమె చెవినికూడా సోకకుండానే గాలిలో కలిసి పోతూండటంవల్ల-శ్రీపతి కిక్కురు మనకుండా విని ఊరుకోటాన్ని అలవాటు చేసుకొన్నాడు.

ఆమె విసుగుతో గొణుక్కుంటూ పడుకుంది.

రచనకు బ్రేకు పడ్డది. కలం ముడిచి—ఆలోచించసాగాడు. తనకు తగిన ప్రోత్సాహమూ, సానుభూతీ, ఆదరణా వుంటే—తన రచనలు ఇంకెంత తీర్చి దిద్దబడేవి! ఈ ఒక్క కుటుంబసమస్యా తీరిననాడు—తనవి సాటిలేని మేటిరచనలు అవగలవు. కాని తన జీవితంలో అది...తీరనికోరిక!

బీరువాలో పూర్తికాని తన రచనలదస్తరాన్ని చూసి, తన ఓపికకు తనే ఆశ్చర్యపడుతూ, "నా జీవితసమస్య తీరిననాడు ఇవన్నీ పాఠకలోకానికి కానుకలు కాగలవు; అందాకా వాటిముఖం నాకూ, నాముఖం వాటికీ మాత్రమే కన్పిస్తూ వుంటుంది—" అనుకొని నిట్టూర్చాడు.

## 2

అదృష్ట జాతకుల మాటకొస్తే శ్రీపతికి కూడా స్థానం ఇచ్చి తీరాలి. ఇతర వారసులు లేని పాతికవేలరూపాయల ఆస్తికి తను యీనాడు అధికారవటం—సామాన్యమైన విషయం మాత్రం కాదు.

ఆ ఐశ్వర్యకాంతిలో — పూర్వపు అతని బీదరికఛాయ లోని ఏభాగమూ గోచరించదు. విధివశాన, తన తీరనికోరిక తీరినకోరికగా పరిణమించి, తన పూర్వకష్టాల్ని సమూలం మరిచిపోయేట్టు చేసింది.

అతని జీవితలక్ష్యం మాత్రం మొదట్లో మారలేదు. పూర్తికాని తన రచనల్ని అనేకులు చదివి ఆనందించే రోజొకటి ఇంకా ముందుందని అతను నమ్మాడు.

అనేకులు తనరచనలకోసం కాచుకు కూర్చున్నారు. సంపాదకుల ఒత్తిడి జాస్తవుతుంది. పాఠకులు తన రచనల్ని పుస్తకరూపంలో చూడాలని కుతూహలపడుతూన్నట్టు ఉత్తరాలు రాస్తున్నారు. తన పేరు అన్నివైపులనుంచీ ప్రతిధ్వనిస్తోంది.

అతను అనుకొన్న గొప్పసమస్య రూపుమాసినా, దాని స్థానే మరికొన్ని సమస్యలు రాకపోలేదు. ఆ ఆస్తికి ఇప్పుడు మరికొందరు దాయాదులు తయారై కోర్టుకెక్కారు. తన ఐశ్వర్యం వాళ్లచేత కబళింపబడకుండా భద్రపరుచుకోటం మొదటిది—ముఖ్యమైనదీకూడా !

ఉన్న కాస్త తీరికలోనూ పాతరచనల్ని తీసి దుమ్ముదులిపి

పూర్తి చేసేందుకు ఉపక్రమించేవాడు. కలం కుంటినడక నడిచేది. హృదయంలో రేకెత్తే ఉన్నతభావాలు కాగితం మీదికి రావటంలేదు. పదాలు తొట్రుపడతై. పూర్వపు రచనను చదువుతే- తెగినచోట పెద్దఅతుకున్నట్టు స్పష్టంగా కన్పిస్తుంది. రచనా సమయంలో—కోర్టూ, ధనమూ, అనుభవమూ, సౌఖ్యమూ జ్ఞాపక మొచ్చి తన నిశ్చలత్వాన్ని కూకటివేళ్ళతో కదిలిస్తుంది. తన దనుకొన్న లేఖిని తనకే ఏకుమేకై ఎదురుతిరుగుతోంది; తన కళకు వృద్ధాప్యం వచ్చిందేమో! రచన కుదరక, విసుగుతో విరమించేవాడు. 'కథకుడు'గా తనను తనే నమ్మలేనిస్థితిలో శ్రీపతి తత్వం తయారైంది.

## 3

ప్రభుత్వ చట్టాలకు శ్రీపతిలాటి అనేకమంది జీవితాల్ని తారుమారుచేసే శక్తివుందని-తన జ్ఞాతులు దావా గెల్చిన నాడుమాత్రమే అతను నేర్చుకున్నాడు. శ్రీపతి రెండు సంవత్సరాలు మాత్రమే యీలోకానికి 'శ్రీపతి' అయ్యాడు. ఏకట్టుగుడ్డల్తో ఆపూరిపాకను వదిలాడో—ఆ కట్టుగుడ్డల్తో మాత్రమే తిరిగి ప్రవేశించాడు. చలనంలేని ఆ మట్టిగోడల మధ్య కూర్చొని రెండు సంవత్సరాల క్రితపు వాతావరణాన్ని వెనక్కు చూసుకొన్నాడు — ఎంతలో ఎంతగా పరిణమించిందీ—తన జీవితం!

ఐశ్వర్యవంతుడుగా ఉన్నప్పుడు తనకున్న పలుకుబడి—తనకొక చిన్న ఉద్యోగాన్ని ప్రసాదించటానికి ఉపయోగ

పడ్డది; ఆజీతం సరిగ్గా కుటుంబరక్షణకు మాత్రమే సరిపోతుంది. తను భాగ్యవంతుడుగా ఉన్నప్పుడు తనలో రేకెత్తిన అంతులేని కోరికలన్నీ నేడు అడుగంటిపోయినై.

అర్ధరాత్రి అనేక భావాలమేల్కొల్పుతో, హృదయంలో దాగేందుకు తావులేక ఉరికిపడుతూన్న ఊహల సమూహపు టొత్తిడితో — శ్రీపతి రచనకు ఉపక్రమించాడు. సరిగ్గా రెండు సంవత్సరాలక్రితం గృహిణిమాటలకు భయపడి మూల నక్కిన 'కథ'—అది! కాలగమనం ఆ రచనలోమాత్రం మార్పును తేలేకపోయింది!

ఇల్లంతా నిశ్శబ్దదేవత తాండవిస్తోంది. దీపపు వెలుగులో నిద్రాముద్రితలోకాన్ని విడిచి నూతన వాతావరణంలో— కలం నిరాటంకంగా సాగిపోతోంది. పూర్వపు రచనతో సరిగ్గా సరిపడే విధంగా వ్రాయటాన్ని ఆకలం తిరిగి యీనాడు ప్రదర్శిస్తోంది. కథ పూర్తయింది. తనలో ఇమిడివున్న 'కళ'కు చలనం లేదని స్ఫురిస్తోంది—రచన చదువుతూంటే—ఏక బిగిని రాసిన కథని తెలుస్తోంది—నశించిందనుకొన్న శక్తి యీనాడు తిరిగి పునర్జన్మ ఎత్తింది—శిశువుగా కాదు; నడి వయస్కగా!

భార్య మేల్కొని అంది: "ఏమిటిది?" అతను ఉలిక్కిపడలేదు—చలించ లేదు.

"క—థ"

ఆమె కూడా పరామర్శ చేయలేదు. కుటుంబరక్షణ సాగుతూన్నన్నాళ్లూ తనకు దిగులు లేదన్నట్టు ఆమె పెదవి విరిచి కిక్కురు మనకుండా పడుకొంది.

శ్రీపతికి పూర్వంసంగతి జ్ఞాపకమొచ్చింది. తనమీద కోరాలూ, మిరియాలూ నూరిన తన ధర్మపత్నికి యీ నాడు తన కళారాధనలో పనిలేదు. తను భ్రమించే ఆటంకాలేమీ లేవు—ఉన్నా అవి తనమీద తగిన చర్య తీసుకునేటంత బలంగానూ లేవు.

జీవితాన్ని రెండు వసంతాలు వెనక్కి తిరిగి చూసుకొన్నాడు ; అతని హృదయాంతరాళంలో యీ వాక్యాలు మారుమ్రోగాయ్: "జీవితంలో ఎప్పుడూ ఏదో వొక లోపమూ, సమస్యా ఉండితీరుతయ్. ఉన్నా దాంతో కళారాధనకు ముడిపెట్టుకోవటం తగనిపని. ఐశ్వర్యవంతుడినై నేను ఆరాధించలేని యీ సాహిత్య సేవను-బీదరికంలోనే సాధించగలను. ఈ వాతావరణంలోనే నా సాహిత్యసేవ మిన్నుముట్టగలదు."

మరి రెండు సంవత్సరాల్లో ఇది నిజమే అయింది !

—జనవరి, 1941